# పసిబిడ్డల అత్యవసర సంరక్షణ

"తల్లులలో అవగాహనా రాహిత్యం వల్లే పసిపిల్లల ఆరోగ్యం విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గర్భధారణ, కాన్పు, పిల్లల సంరక్షణ విషయంపై ప్రతీ తల్లికి కనీస అవగాహన అవసరం" అని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డా॥వై సాయికిషోర్ పేర్కొన్నారు. శనివారం వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డా॥సమరం అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని "పసిబిడ్డల అత్యవసర సంరక్షణ" అంశంపై ప్రసంగించారు. తల్లి గర్భధారణ విషయంలోనూ, గర్భిణీగా ఉన్న సమయంలోనూ ఆరోగ్యరక్షణ విషయంలో అప్రమత్తత కలిగి ఉంటే 90 శాతం పిల్లలు చాలా ఆరోగ్యంగా పుడతారని, ఎటువంటి వైద్య సమస్యలు ఎదురవ్వవని అన్నారు. 10శాతం కేసుల్లోనే పసిపిల్లల అత్యవసర సంరక్షణ అవసరం అవుతుందని, అది కూడా కాన్పుకాగానే పిల్లల విషయంలో తీసుకునే శ్రద్ధతో అధికమించవచ్చని అన్నారు. కేవలం ఒక శాతం పసిబిడ్డల విషయంలోనే అత్యాధునిక చికిత్స అవసరం అవుతుందన్నారు. తక్కువ బరువుతో పుట్టిన, అధిక బరువు కలిగి ఉన్న పసిపిల్లల సంరక్షణ అత్యంత అవసరం అన్నారు. బిడ్డ పుట్టగానే నలుగుపెట్టి స్నానం చేయించడం, ముక్కులో, చెవిలో ఆముదం, నూనె వేయడం, తల గుండ్రంగా ఉండాలని చేతులతో నొక్కడం వంటి పనులు అనర్థాలని కలిగిస్తాయన్నారు. పసిబిడ్డ సంరక్షణలో పరిశుభ్రత, వెచ్చదనం, పాన్పు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. కాన్పు కాగానే శిశువు ఏడవని పక్షంలో కొద్దిపాటి ప్రేరణ కలిగించాలని, గొంతుని శుభ్రపరచాలని, గాలి ఆడేటట్లు చూడాలని అన్నారు. బిడ్డ పెదవులు, గోళ్ళు నీలంగా ఉంటే సక్రమంగా గాలి అందేటట్లు గుర్తు అని కృత్రిమ శ్వాస పద్ధతి ద్వారా గాలి అందేటట్లు చేయాలని అన్నారు. శిశువు జన్మించగానే ఉండవలసిన ఆరోగ్య లక్షణాలు ఉన్నాయా లేదా గమనించి వెంటనే దానికి తగిన చికిత్స అందిస్తే ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. బిడ్డ పుట్టిన మొదటి 24గంటలు చాలా ముఖ్యమైన సమయం అని, ఆ సమయంలో కలిగే మార్పులని వెంటనే గుర్తించాలని అన్నారు. 28 రోజులు వరకు పసిబిడ్డ సంరక్షణ విషయంలో జాగ్రత్త వహిస్తే ఎటువంటి ప్రమాదాలు ఉండవన్నారు. పసిబిడ్డల సంరక్షణ విషయంలో అవగాహనా రాహిత్యమే అత్యధిక శిశు మరణాలకి కారణం అవుతోందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. గర్భం ధరించిన దగ్గర నుండి కాన్పు అయ్యేవరకు ఒకే వైద్యుని పర్యవేక్షణలో ఉన్నట్లైతే పసిబిడ్డల ఆరోగ్య సంరక్షణ విషయంలో ఇబ్బందులు ఎదురవ్వకుండా ముందుగానే జాగ్రత్తపడటం ఉంటుందన్నారు.